# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 21-01-2017**

బ్రాహ్మణ పేదల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి వీలుగా ఓ సొసైటీ ప్రారంభించాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు ఆదేశించారు. బ్రాహ్మణ సదన్ కోసం ఇప్పటికే స్థలం కేటాయించినందున భవన నిర్మాణం కూడా ప్రారంభించాలని సిఎం చెప్పారు. ప్రగతి భవన్లో శుక్రవారం బ్రాహ్మణ సంక్షేమ కార్యక్రమాల కోసం తీసుకోవలసిన చర్యలపై సిఎం సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ సిఎం కడియం శ్రీహరి, మంత్రులు హరీష్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, జగదీష్ రెడ్డి, జోగు రామన్న, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, రమణాచారి, రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మి కాంతరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్ రెడ్డి, సీనియర్ అధికారులు శివశంకర్, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

"బ్రాహ్మణుల సంక్షేమ నిధికి ఇప్పటికే ప్రభుత్వం వంద కోట్ల రూపాయలు కేటాయించింది. బ్రాహ్మణ సదన్ నిర్మించడానికి స్థలం కూడా కేటాయించింది. ఈ నిధులు, సదన్ ను ఉపయోగించుకుని బ్రాహ్మణుల సంక్షేమం, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడానికి వీలుగా ఓ సొసైటీని ఏర్పాటు చేయాలి. త్వరలోనే సొసైటీని రిజిష్టర్ చేసి, బాధ్యతలు అప్పగించాలి" అని సిఎం కేసీఆర్ ఆదేశించారు.

"బ్రాహ్మణ సదన్ ను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బ్రాహ్మణులకు ఆశ్రయం కలిపించే వెసులుబాటుండాలి. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలి. భోజనం, వసతి ఏర్పాటు చేయాలి. ఆధ్మాత్మిక లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సెంటర్ సదన్ లో ఉండాలి. పేద బ్రాహ్మణులు చదువుకోవడానికి అనువైన వాతావరణం ఉండాలి. మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి" అని సిఎం ఆదేశించారు.

**సిపిఆర్ఓ టు సిఎం**